పాఠశాలల పనులు త్వరగా పూర్తి చేయాలి

ములుగు కలెక్టర్ ఇలా త్రిపాఠి

మాట్లాడుతున్న కలెక్టర్ ఇలా త్రిపాఠి

వెంకటాపురం (నూగూరు), ఏప్రిల్ 16 : పాఠశాలల మరమ్మతు పనులు త్వరగా పూర్తి చేయాలని కలెక్టర్ ఇలాత్రిపాఠి అధికారులను ఆదేశించారు. మంగళవారం మండలంలోని జడ్పీహెచ్ఎస్ వెంకటాపురం పాఠశాల, యూపీఎస్ వీరభద్రవరం పాఠశాలలను అదనపు కలెక్టర్ శ్రీజతో కలిసి ఆమె సందర్శించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ పాఠశాలల అభివృద్ధి కోసం రూపొందించిన ప్రతిపాదనలో 25 శాతం నిధులు ముందస్తుగా అమ్మ ఆదర్శ పాఠశాలలకు మంజూరు చేయనున్నట్లు చెప్పారు. వీటిని వినియోగించుకొని పనులు రికార్డ్ చేసిన వారం రోజుల్లో బిల్లులు చెల్లించేలా ఏర్పాట్లు చేశామన్నారు. ప్రభుత్వ పాఠశాలలకు అవసరమైన ఎలక్రికల్ వస్తువులు, ఇతర చిన్న చిన్న పనులు వెంటనే పూర్తి చేయాలని సూచించారు. పాఠశాలల పునఃప్రారంభానికి ముందే బాల,బాలికల టాయిలెట్స్, తాగునీటి సరఫరా, తరగతి గదుల్లో ఉన్న మైనర్ రిపేర్లు ప్రాధాన్యతా క్రమంలో పూర్తి చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో మండల ప్రత్యేకాధికారి స్వర్ణలత, ఎంపీడీవో రాజేంద్రప్రసాద్, ఎంఈవో వెంకటేశ్వర్‌రావు, పీఆర్ ఏఈ రాజేశ్, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ శ్రీనివాసరావు పాల్గొన్నారు.

ఓటు హక్కు వజ్రాయుధం

ములుగురూరల్ : ప్రజాస్వామ్యంలో ఓటు హక్కు ఎంతో విలువైందని, ఓటు హక్కు వజ్రాయుధమని కలెక్టర్ ఇలా త్రిపాఠి అన్నారు. మంగళవారం కలెక్టరేట్‌లో ఓటరు సెల్ఫీ పాయింట్‌ను ఆమె అదనపు కలెక్టర్ శ్రీజ, డీఆర్‌డీవో శ్రీనివాస్‌కుమార్‌తో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో ఓటింగ్ శాతం పెరిగేలా అధికారులు ప్రజలకు అవగాహన కల్పించాలని అన్నారు. ఈజీఎస్ ఏపీడీ వెంకటనారాయణ, డీపీఎం సతీశ్, ఏపీఎం పాషా పాల్గొన్నారు.

'ఓపెన్' పరీక్షలు సమన్వయంతో నిర్వహించాలి

మాట్లాడుతున్న అదనపు కలెక్టర్ మహేందర్‌జీ

ములుగురూరల్, ఏప్రిల్ 16 : విద్యాశాఖ అధికారులు ఓపెన్ స్కూల్ పరీక్షలను సమన్వయంతో నిర్వహించాలని అదనపు కలెక్టర్ సీహెచ్ మహేందర్‌జీ అన్నారు. మంగళవారం కలెక్టరేట్‌లో ఓపెన్ స్కూల్ పరీక్షలపై అధికారులతో సమన్వయ సమావేశం నిర్వహించారు. పరీక్ష కేంద్రాల్లో సెల్ ఫోన్లను అనుమతించకుండా నిబంధనలు పాటిస్తూ పరీక్షలకు ఏర్పాట్లు చేయాలన్నారు. జిల్లాలో మూడు పరీక్ష కేంద్రాల్లో 10వ తరగతిలో 526 మంది అభ్యర్థులు, ఇంటర్మీడియట్‌లో 602 మంది పరీక్ష రాయనున్నట్లు తెలిపారు. సమావేశంలో డీఈవో పాణిని, విద్యుత్ శాఖ డీఈ నాగేశ్వర్‌రావు, జిల్లా ఇంటర్మీడియట్ అధికారి వెంకటేశ్వర్లు, సైన్స్ అధికారి జయదేవ్, డీపీవో మేనేజర్ శంకర్, ఆర్ఎస్సై కనకయ్య, డీపీఆర్వో రఫిక్, జిల్లా క్షయనియంత్రణ అధికారి డాక్టర్ రవీందర్‌నాయక్ పాల్గొన్నారు.

రైతులకు ఇబ్బందులు లేకుండా చూడాలి

వెంకటాపురం (నూగూరు), ఏప్రిల్ 16 : ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో రైతులకు ఇబ్బందులు లేకుండా చూడాలని ములుగు సివిల్ సప్లై అధికారి రాంపతి అన్నారు. మంగళవారం మండలంలోని ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రైతుల వద్ద కొనుగోలు చేసిన ధాన్యంలో ఎలాంటి తరుగు లేకుండా మిల్లర్లు దిగుమతి చేసుకోవాలని వారితో ఫోన్లో మాట్లాడారు. రైతులు తాము పండించిన పంటను ఎండబెట్టుకొని తాలు లేకుండా కొనుగోలు కేంద్రానికి తీసుకురావాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ములుగు డీటీ రాంచందర్, సొసైటీ సెక్రటరీ సత్యనారాయణ, సిబ్బంది పూర్ణ పాల్గొన్నారు.

కుట్రలో భాగంగానే హరిబాబు అరెస్ట్

- రైతులకు వేసిన రోడ్డుపై రాజకీయాలు సిగ్గుచేటు
- అధికారులు నిష్పక్షపాతంగా వ్యవహరించాలి
- పోలీసులు ప్రజలకు నమ్మకం కలిగేలా పని చేయాలి
- భూపాలపల్లి మాజీ ఎమ్మెల్యే గండ్ర వెంకటరమణారెడ్డి

బీఆర్ఎస్ జిల్లా కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న భూపాలపల్లి మాజీ ఎమ్మెల్యే గండ్ర వెంకటరమణారెడ్డి

కృష్ణకాలనీ, ఏప్రిల్ 16 : రాజకీయ కుట్రలో భాగంగానే భూపాలపల్లి మున్సిపాలిటీ మాజీ వైస్ చైర్మన్ కొత్త హరిబాబుపై అక్రమ కేసులు పెట్టారని మాజీ ఎమ్మెల్యే గండ్ర వెంకటరమణారెడ్డి అన్నారు. మంగళవారం భూపాలపల్లి జిల్లా కేంద్రంలోని బీఆర్ఎస్ జిల్లా కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. హరిబాబును సోమవారం రాత్రి హనుమకొండలో అక్రమంగా అరెస్ట్ చేశారని, ఈ విషయమై భూపాలపల్లి ఎస్పీ, డీఎస్పీలను వివరణ కోరగా ఒక ల్యాండ్ విషయమై విచారించేందుకు అదుపులోకి తీసుకున్నట్లు చెప్పారన్నారు. పోలీసులు చెప్పిన విషయాలపై తాను ఆరా తీయగా కాశింపల్లి గ్రామ రైతులు తమ పొలాలకు మోకాలి లోతు బురదలో వెళ్లాల్సి వస్తున్నదని, రోడ్డు సౌకర్యం కావాలని కోరినట్లు తెలిపారు. దీనికి స్పందించిన ప్రభుత్వం కాశింపల్లి నుంచి తూండ్ల వరకు డీఎంఎఫ్టీ నిధుల నుంచి రూ. 15 లక్షలు, టీయూఎఫ్ఐడీసీ నిధుల నుంచి రూ. 25 లక్షలతో రోడ్డు వేశారన్నారు. ఆ రోడ్డు ఒక వ్యక్తి కోసం కాదని, రైతుల డిమాండ్ మేరకు 2021లో వేశామన్నారు. మూడేళ్ల క్రితం రోడ్డు వేస్తే ఇప్పుడు అనిల్‌కుమార్ అనే వ్యక్తి ఇచ్చిన ఫిర్యాదు మేరకు హరిబాబు, ఆయన తమ్ముడు దశరథంపై తప్పుడు కేసులు బనాయించి అరెస్ట్ చేయడం సరైంది కాదన్నారు. నియోజకవర్గంలో బీఆర్ఎస్ ప్రజా ప్రతినిధులు, కార్యకర్తలను భయపెట్టే ఘటనలు జరుగకుండా పోలీసు యంత్రాంగం చూడాలని కోరుతున్నామన్నారు. పోలీసులు ప్రజలకు నమ్మకం కలిగేలా పనిచేయాలని, భయపెట్టే చర్యలకు పాల్పడొద్దని హెచ్చరించారు. కౌన్సిలర్ హరిబాబు అక్రమ అరెస్ట్ విషయంపై ఎస్పీ, డీఎస్పీ నిజానిజాలను ప్రత్యక్షంగా తెలుసుకొని, సమగ్ర విచారణ జరపాలని డిమాండ్ చేశారు. ఇప్పటికైనా పోలీసు అధికారులు ఒకరి కనుసన్నల్లో పని చేయొద్దని, రాజ్యాంగబద్ధంగా విధులు నిర్వర్తించి తమ శాఖకు మంచిపేరు తీసుకురావాలన్నారు. ఇప్పటికైనా హరిబాబు అక్రమ అరెస్ట్‌పై పోలీసులు సమగ్ర విచారణ జరపాలని డిమాండ్ చేశారు. సమావేశంలో బీఆర్ఎస్ కౌన్సిలర్ ముంజం పెల్లి మురళీధర్, నాయకులు సెగ్గం సిద్ధు, మాడ హరీశ్‌రెడ్డి, బానోత్ జుమ్ము లాల్, సింగనవేణి చిరంజీవి, కరాటే శ్రీనివాస్, జోరు ఈశ్వర్, మోకిడి అశోక్, ప్రేమ్‌కుమార్, రాకేశ్, రాజు, రాజ్ కుమార్, భాస్కర్, బోయిన రవి తదితరులు పాల్గొన్నారు.

తాగు నీటి ఎద్దడి లేకుండా చూడాలి

- విధుల్లో నిర్లక్ష్యం వహిస్తే చర్యలు
- భూపాలపల్లి కలెక్టర్ భవేశ్ మిశ్రా
- మహదేవపూర్, కాటారం మండలాల్లో పర్యటన
- భగీరథ నీటి సరఫరాపై ఆరా

మహదేవపూర్ : తాగు నీటిపై ఆరా తీస్తున్న కలెక్టర్ భవేశ్ మిశ్రా

మహదేవపూర్ (కాటారం), ఏప్రిల్ 16 : గ్రామాల్లో ప్రజలకు తాగు నీటి ఎద్దడి లేకుండా చూడాలని జయశంకర్ భూపాలపల్లి కలెక్టర్ భవేశ్ మిశ్రా అధికారులను ఆదేశించారు. మంగళవారం ఆయన కాటారం, మహదేవపూర్ మండల కేంద్రంతో పాటు బొమ్మాపూర్‌లోని ఎస్సీకాలనీ, రాపల్లికోటలో ఆకస్మికంగా పర్యటించారు. ఆయా గ్రామాల్లోని కాలనీల్లో అధికారులతో కలిసి కలియతిరిగి ఇంటింటా ఏర్పాటు చేసిన మిషన్ భగీరథ నీటి సరఫరాపై ఆరా తీశారు. భగీరథ నీరు క్రమం తప్పకుండా వస్తుందా? అని గృహిణులను కలెక్టర్ అడిగి తెలుసుకున్నారు. విధుల్లో నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తప్పవని కలెక్టర్ హెచ్చరించారు. ఆయన వెంట మహదేవపూర్ మండల ప్రత్యేకాధికారి, డీఎల్‌పీవో వీరభద్రం, తహసీల్దార్లు ప్రహ్లాద్ రాథోడ్, నాగరాజు, ఎంపీడీవోలు బాబు, వెంకటేశ్వర్లు, పంచాయతీ రాజ్ డీఈఈ సాయిలు, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈలు రమేశ్, వినయ్ పాల్గొన్నారు.

చెత్తా చెదారాన్ని తొలగించాలి

భూపాలపల్లి రూరల్ : భూపాలపల్లి మున్సిపాలిటీ పరిధిలోని వివిధ కాలనీల్లో పేరుకు పోయిన చెత్త, చెదారాన్ని వెంటనే తొలగించాలని కలెక్టర్ మున్సిపల్ అధికారులను ఆదేశించారు. మంగళవారం 16వ వార్డు రాంనగర్‌కాలనీలోని సాంఘిక సంక్షేమ వసతి గృహం ఆవరణలోని ప్రభుత్వ స్థలాన్ని ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం నిర్మాణ పనులను ఈ స్థలంలో చేపట్టాలని అధికారులను ఆదేశించారు. యాదవనగర్ కాలనీ వాసులకు సింగరేణి గనుల నుంచి వచ్చే నీటిని ఫిల్టర్‌బెడ్ ద్వారా శుద్ధి చేసి అందించాలని, గణపురం మండలం గాంధీనగర్‌లోని మిషన్ భగీరథ నీటిని ల్యాబ్‌లో పరీక్షించిన తర్వాతే పట్టణ ప్రజలకు సరఫరా చేయాలన్నారు. వేసవి పూర్తయ్యే వరకు సింగరేణి యాజమాన్యం రోజుకు ఒక గంట పాటు నల్లాల ద్వారా నీటి సరఫరా చేయాలని కలెక్టర్ ఆదేశించారు. ఆయన వెంట అదనపు కలెక్టర్ వెంకటేశ్వర్లు, మున్సిపల్ కమిషనర్ రాజేశ్వర్, ఏఈ రోజా, సింగరేణి అధికారులు ఉన్నారు.

వ్యవసాయ బోర్లను లీజుకు తీసుకోవాలి

గణపురం, ఏప్రిల్ 16 : కొండాపూర్ గ్రామపంచాయతీ పరిధిలో ప్రజలకు నీటి ఎద్దడి లేకుండా చర్యలు చేపట్టాలని ఎంపీడీవో భాస్కర్ సూచించారు. మంగళవారం జీపీ కార్యాలయాన్ని తనిఖీ చేసి రికార్డులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నీటి కొరత ఉన్న పక్షంలో వ్యవసాయ బోర్లను లీజుకు తీసుకోవాలని కార్యదర్శికి సూచించారు. అనంతరం నర్సరీని పరిశీలించారు. ఆయన వెంట కార్యదర్శి సాయిని రమేశ్, జడ్పీహెచ్ఎస్ హెచ్ఎం ఎంవీ చారి, ప్రాథమిక పాఠశాల హెచ్ఎం మార్క సదయ్య, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు ప్రశంసా పత్రాలు

గణపురం, ఏప్రిల్ 16 : మండల కేంద్రంలోని ఎంపీపీ స్కూల్ విద్యార్థులకు ప్రశంసా పత్రాలను మంగళవారం హెచ్ఎం దూలం కుమారస్వామి అందజేశారు. ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థులకు ఆంగ్ల భాషలో నైపుణ్యత సాధించేందుకు కలెక్టర్ కొన్ని పాఠశాలలను ఎంపిక చేశారు. అందులో భాగంగా ఎంపికైన ఎంపీపీఎస్ విద్యార్థులకు ప్రత్యేకంగా రూపొందించి అందించిన పుస్తకాలతో వారు పట్టు సాధించారు. ఈ నేపథ్యంలో విద్యా ప్రమాణాలను తెలుసుకునేందుకు నిర్వహించిన పరీక్షల్లో నైపుణ్యం సాధించిన విద్యార్థులకు కలెక్టర్ ప్రశంసా పత్రాలు పంపించగా హెచ్ఎం అందజేశారు.

ఎన్నికలను నిష్పక్షపాతంగా నిర్వహించాలి

- పెండింగ్ కేసులు త్వరగా పరిష్కరించాలి
- విధుల్లో అలసత్వం వహిస్తే వేటు తప్పదు
- మల్టీజోన్ ఐజీ రంగనాథ్

సమావేశంలో మాట్లాడుతున్న ఐజీ రంగనాథ్

ములుగు, ఏప్రిల్16 (నమస్తే తెలంగాణ) : మావోయిస్టు ప్రాబల్యం ఉన్న ములుగు జిల్లాలో పోలీస్ శాఖ పకడ్బందీ చర్యలు తీసుకొని పార్లమెంట్ ఎన్నికలు శాంతియుత వాతావరణంలో నిర్వహించాలని మల్టీజోన్ ఐజీ ఏవీ రంగనాథ్ అన్నారు. మంగళవారం ఆర్‌అండ్‌బీ అతిథి గృహంలో ఎస్పీ డాక్టర్ పీ శబరీశ్ అధ్యక్షతన నిర్వహించిన నేర సమీక్షలో ఐజీ పాల్గొని పోలీస్ అధికారులను ఉద్దేశించి మాట్లాడారు. 2022 కంటే ముందు ఉన్న పెండింగ్ కేసులను నెల రోజుల లోపు లేదా తదుపరి నేర సమీక్ష సమావేశం నిర్వహించే లోగా పెండింగ్‌లో ఉండకుండా బాధితులకు న్యాయం చేయాలని ఆదేశించారు. ఛత్తీస్‌గఢ్, ములుగు సరిహద్దు ప్రాంతాల్లో స్పెషల్ పార్టీ బలగాల ద్వారా ముమ్మర తనిఖీలు నిర్వహించాలన్నారు. ప్రజలకు ఎన్నికల ప్రక్రియపై నమ్మకం కలిగేలా గ్రామాల్లో పోలీస్ బలగాలతో ఫ్లాగ్ మార్చ్ నిర్వహించాలని ఆదేశించారు. అక్రమ నగదు, మద్యానికి అడ్డుకట్ట వేసేలా చెక్‌పోస్టులను బలోపేతం చేయాలని తెలిపారు. అటవీ ప్రాంతాలతో సరిహద్దు ఉండటం వల్ల ములుగు జిల్లాలో గంజాయి రవాణా ఎక్కువ జరుగుతున్న నేపథ్యంలో ఆకస్మిక తనిఖీలు నిర్వహించి అడ్డుకట్ట వేయాలన్నారు. విధుల్లో పోలీస్ అధికారులు అలసత్వం వహిస్తే వేటు తప్పదని హెచ్చరించారు. సమావేశంలో ఏటూరునాగారం ఏఎస్పీ గీతేమహేశ్ బాబాసాహెబ్, డీఎస్పీలు రవీందర్, రాములు, సీఐలు రంజిత్‌కుమార్, శ్రీధర్, శంకర్, రాజు, కుమార్, ఎస్సైలు, పోలీస్ అధికారులు పాల్గొన్నారు.

మతతత్వ బీజేపీని ఓడించాలి

మాట్లాడుతున్న కడియం కావ్య

భూపాలపల్లి రూరల్, ఏప్రిల్ 16 : దేశంలో మతతత్వాన్ని ప్రోత్సహిస్తున్న బీజేపీని ఓడించాలని కాంగ్రెస్ వరంగల్ పార్లమెంట్ అభ్యర్థి కడియం కావ్య అన్నారు. మంగళవారం భూపాలపల్లిలోని ఏఎస్ఆర్ గార్డెన్‌లో స్థానిక ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు అధ్యక్షతన సన్నాహక సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ బీజేపీ అభ్యర్థి వర్ధన్నపేటలోని ఎంతో మంది పేదల భూములను కబ్జా చేశాడని, అందుకే కడుపు మండిన ప్రజలు అతడిని ఎమ్మెల్యేగా ఓడించారని అన్నారు. బీజేపీ ప్రభుత్వం పదేళ్లుగా దేశానికి చేసిందేమీ లేదన్నారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ బీజేపీ ప్రభుత్వం దేశాన్ని అప్పులు పాలు చేసిందని, నిరుద్యోగులను పెంచిందని, ప్రభుత్వ సంస్థలను ప్రైవేట్ పాలు చేసిందని అన్నారు. సమావేశంలో వర్ధన్నపేట, పాలకుర్తి, పరకాల ఎమ్మెల్యేలు నాగరాజు, యశస్వినిరెడ్డి, రేవూరి ప్రకాశ్‌రెడ్డి, కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు అయిత ప్రకాశ్‌రెడ్డి, నాయకులు, కౌన్సిలర్లు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ధాన్యం కొనుగోలు కేంద్రాలు ప్రారంభం

మహదేవపూర్ (కాటారం), ఏప్రిల్ 16 : మండలంలోని ధన్వాడ, శంకరాంపల్లి, గంగారం, విలాసాగర్, జాదురావుపేట గ్రామాల్లో ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వరి ధాన్యం కొనుగోలు కేంద్రాలను సీఈవో ఎడ్ల మహేశ్ మంగళవారం ప్రారంభించారు. రైతులు దళారులను నమ్మి మోసపోవద్దన్నారు. కొనుగోలు కేంద్రాల్లో ధాన్యాన్ని విక్రయించి గిట్టుబాటు ధర పొందాలని సూచించారు. రైతులు, సంఘ సభ్యులు, సిబ్బంది పాల్గొన్నారు.

వెంకన్న కల్యాణానికి వేళాయె..

ముస్తాబైన వేంకటేశ్వరస్వామి ఆలయం

మహదేవపూర్, ఏప్రిల్ 16 : మండల కేంద్రంలోని శ్రీమంద రగిరి ఆలయం శ్రీవేంకటేశ్వర స్వామి కల్యాణానికి ముస్తాబైంది. శ్రీరామనవమి సందర్భంగా బుధవారం నిర్వహించే వేడుకల కోసం అధికారులు ఏర్పాట్లు పూర్తిచేశారు. తాగునీటి వసతి, చలువ పందిళ్ల ,ప్రత్యేక, ఉచిత దర్శన క్యూలైన్లు, ప్రసాద కౌంటర్లను ఏర్పాటు చేసినట్లు ఆలయ కార్యనిర్వహణ అధికారి బిల్లా శ్రీనావాస్, అర్చకుడు తిరునగరి నవీన్ తెలిపారు.

అడవికి నిప్పంటుకోకుండా చర్యలు

పలిమెల, ఏప్రిల్ 16 : వేసవిలో అడవికి నిప్పంటుకోకుండా చర్యలు చేపడుతున్నట్లు మహదేవపూర్ ఎఫ్‌డీవో వజ్రారెడ్డి తెలిపారు. మంగళవారం పలిమెల మండలం సౌత్ బీట్ పరిధి బోడాయిగూడెం, మహాముత్తారం మండలం సౌత్ బీట్ పరిధి ఎత్తారం, నిమ్మగూడెం, పెగడపల్లి బీట్లలో అంటుకున్న మంటలను ఫారెస్ట్ అధికారులు ఆర్పివేశారు. అనంతరం పలిమెల కామన్‌పల్లి వెస్ట్ బీట్ పరిధిలో వన్యప్రాణుల దాహం తీర్చేందుకు ఏర్పాటు చేసిన బోరు ద్వారా నీటిని కుంటల్లో నింపారు. అలాగే వన్యప్రాణులు సంచరించే ప్రాంతాలను గుర్తించి వాచ్ టవర్ నిర్మించి, కెమెరా ట్రాప్‌లను ఏర్పాటు చేసి వాటి సంచారాన్ని గమనిస్తున్నట్లు అధికారులు తెలిపారు. కార్యక్రమంలో పలిమెల రేంజ్ అధికారి వెంకటేశ్వర్‌రావు, సెక్షన్, బీట్ అధికారులు, బేస్ క్యాంప్ సిబ్బంది పాల్గొన్నారు.

సబ్ స్టేషన్‌లో అగ్నిప్రమాదం

ములుగు, ఏప్రిల్16 (నమస్తే తెలంగాణ) : ములుగు జిల్లా కేంద్రంలోని 33/11కేవీ సబ్‌స్టేషన్‌లో మంగళవారం రాత్రి అగ్ని ప్రమాదం జరిగింది. ములుగు మండలం కాసిందేవిపేట ఫీడర్‌లోని లింబు ఫెయిల్ కావడంతో మంటలు అంటుకున్నాయి. విద్యుత్ అధికారులు అగ్నిమాపక కేంద్రానికి సమాచారం ఇవ్వగా సిబ్బంది చేరుకొని మంటలను ఆర్పివేశారు. ప్రమాదంతో కాసిందేవిపేట, అబ్బాపురం, ములుగు, మల్లంపల్లి, గోవిందరావుపేట మండలంలోని పస్రా, వెంకటాపూర్ మండలంలోని వెల్తుర్లపల్లి ఫీడర్లకు 45 నిమిషాల పాటు విద్యుత్ సరఫరా నిలిచిపోయింది. విద్యుత్ శాఖ డీఈ నాగేశ్వర్‌రావు, ఏఈ సాయికృష్ణ, ఎస్సైలు వెంకటేశ్వర్, లక్ష్మారెడ్డిలు ప్రమాదం జరిగిన తీరును పరిశీలించారు. మరమ్మతులు చేపట్టి విద్యుత్ సరఫరాను పునరుద్దరించారు.

పాఠశాలల నిధులు సద్వినియోగం చేసుకోవాలి

వాజేడు, ఏప్రిల్ 16 : పాఠశాలల మరమ్మత్తుల కోసం 25శాతం నిధులు ముందస్తుగా ఎంపిక చేసిన అమ్మ ఆదర్శ పాఠశాలలకు కేటాయించామని వాటిని సద్వినియోగం చేసుకోవాలని డీసీవో సర్దార్‌సింగ్ అన్నారు. మండల ప్రజాపరిషత్ కార్యాలయంలో మంగళవారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈ నిధులతో ప్రభుత్వ పాఠశాలలకు అవసరమైన ఎలక్ట్రికల్ వస్తువులు, ఇతర చిన్నచిన్న పనులతో పాటు టాయిలెట్స్ తదితర పనులు చేయించుకోవాలని సూచించారు. సమావేశంలో ఏంపీడీవో విజయ, తహసీల్దార్ శ్రీనివాస్, నాయబ్ తహసీల్దార్ రహూల్‌చంద్రవర్మ, ఉపాధ్యాయులు, వీవోఏలు పాల్గొన్నారు.

రామయ్యకు డాక్టరేట్

ములుగురూరల్, ఏప్రిల్16 : మండలంలోని అబ్బాపురం ప్రభుత్వ పాఠశాలలో గణిత ఉపాధ్యాయుడిగా పనిచేస్తున్న కందాల రామయ్యకు ఉస్మానియా యూనివర్సిటీ నుంచి డాక్టరేట్ లభించింది. మనోవిజ్ఞానశాస్త్రంలో పరిశోధన చేసినందుకు డాక్టరేట్ ప్రధానం చేసినట్లు యూనివర్సిటీ పరీక్షల విభాగం సంచాలకుడు ప్రొఫెసర్ రాములు ఈ నెల 10న ఉత్తర్వులు జారీ చేశారు.

ఒక మోటర్‌తో దేవాదుల పంపింగ్

కన్నాయిగూడెం, ఏప్రిల్ 16 : మండలంలోని దేవాదుల ఎత్తిపోతల ప్రాజెక్టులోని ఒక మోటర్ ద్వారా గోదావరి నీటి పంపింగ్ మంగళవారం షురూ చేశారు. ఫేస్-2 లోని ఒక మోటర్ ద్వారా 247 క్యూసెక్కుల నీటిని భీంఘనపురం రిజర్వాయర్‌లోకి తరలిస్తున్నట్లు నీటిపారుదల శాఖ డీఈ శరత్, ఏఈఈ సాయిరాం తెలిపారు. గోదావరిలో నీటిమట్టం పూర్తిగా తగ్గిపోవడంతో మార్చి 31న మోటర్లను బంద్ చేశారు. అప్పటినుంచి దిగువన ఉన్న తుపాకులగూడెం సమ్మక్క బరాజ్ గేట్లను బంద్ చేసి నీటిని నిల్వ చేశారు. ప్రస్తుతానికి గోదావరి నీటిమట్టం 75.20 మీటర్ల ఎత్తుకు చేరుకుంది. బరాజ్ ఒక గేటును స్వల్పంగా ఎత్తి 153 క్యూసెక్కుల నీటిని దిగువకు వదులుతున్నారు.

నమస్తే తెలంగాణ క్లాసిఫైడ్స్

ప్లాట్లు అమ్మబడును

★వరంగల్ ట్రైసిటికి హైవేలను ఆనుకొని ఉన్న మా వెంచర్లలో ప్లాట్లు తక్కువ ధరలలో అమ్మబడును. సంప్రదించవలసిన సెల్ నెంబర్. 9701396797.
NTW-323041

లోన్స్

★SBH లో ఖాతా ఉన్న ప్రభుత్వ ఉద్యోగస్తులకు శుభవార్త, ఎటువంటి సమస్యలున్న Solve చేసి లోన్స్ ఇప్పించబడును. సంప్రదించండి సెల్ : 9493910808.
NTW-00

WANTED

★Wanted Cinema Managers to work at Asian Gemini theatre, experience: 5-10 years, interested ones call to 8121021251, hr.corp@asiancinemas.in
NT-6583

గమనిక

క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా వివారించు కోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో నమస్తే తెలంగాణ పత్రికకు ఏ విధమైన సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

For Classified Ads
Please Contact...
9182777552 HANAMKONDA
9182777563
9182777618 WARANAGAL
9182777556
9182777557 JAYASHANKAR BHUPALPALLY
9182777559 MULUGU
9182777135 MAHABUBABAD
9182777554 JANGAON
9182777565

పంట నష్టంపై నివేదిక అందించాలి

ఎమ్మెల్యే సత్యనారాయణరావు

మాట్లాడుతున్న ఎమ్మెల్యే సత్యనారాయణరావు

కృష్ణకాలనీ, ఏప్రిల్ 16 : జిల్లాలో నీటి ఎద్దడి లేకుండా చర్యలు చేపట్టాలని భూపాలపల్లి ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు ఆర్డబ్ల్యూఎస్, పంచాయతీరాజ్ అధికారులను ఆదేశించారు. మంగళవారం జడ్పీ కార్యాలయంలో వైస్ చైర్మన్ కళ్లెపు శోభారఘుపతిరావు అధ్యక్షతన ఏడు స్థాయీ సంఘాల సమావేశం నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన గండ్ర మాట్లాడుతూ వ్యవసాయ శాఖ అధికారులు ఎండిపోయిన పంటల నష్టాన్ని అంచనా వేసి ప్రభుత్వానికి నివేదిక పంపాలన్నారు. తాగునీటి ఎద్దడి నివారణకు అవసరమైన నిధులున్నాయని, గ్రామాల్లో అవసరమైన చోట బోర్లు వేయాలని, పైపులైన్‌లు లీకేజీలకు మరమ్మతు చేయించాలన్నారు. విద్యుత్ అధికారులు కరెంట్ సరఫరాలో ఇబ్బందులు రాకుండా చూడాలన్నారు. సమావేశంలో జడ్పీ సీఈవో విజయలక్ష్మి, జడ్పీటీసీ సభ్యులు, కోఆప్షన్ మెంబర్లు, ఆయా శాఖల అధికారులు, కార్యాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ప్రజల హక్కులను కాలరాస్తున్న కేంద్రం

మాట్లాడుతున్న ఉపేందర్‌రెడ్డి

ములుగురూరల్, ఏప్రిల్ 16 : ప్రధాని మోదీ ప్రభుత్వం ప్రజలు, కార్మికుల హక్కులను కాలరాస్తున్నారని ఎంసీపీఐయూ పొలిట్ బ్యూరో సభ్యుడు పల్లెపు ఉపేందర్‌రెడ్డి అన్నారు. మంగళవారం జిల్లా కేంద్రంలోని రిటైర్డ్ ఉద్యోగుల భవనంలో సీపీఐ ఎంఎల్ రాష్ట్ర కార్యదర్శి ప్రసాద్, సీపీఎం జిల్లా కార్యదర్శి తుమ్మల వెంకట్‌రెడ్డి, సీపీఐ జిల్లా సహాయ కార్యదర్శి జంపాల రవీందర్, న్యూడెమోక్రసీ నాయకుడు మధు, ప్రజా సంఘాల నాయకుడు ముంజాల భిక్షపతిగౌడ్‌తో కలిసి సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతిపక్ష నేతలపై ఈడీ, సీబీఐ దాడులు చేయిస్తూ అరెస్టు చేసి జైళ్లలో పెట్టిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. రాజ్యాంగాన్ని మార్చి మనువాద సంస్కృతిని అమలు చేసేలా బీజేపీ పని చేస్తున్నదని ఆరోపించారు. బీజేపీని, ఆ పార్టీకి అనుకూలంగా ఉన్న శక్తులను రానున్న ఎన్ని కల్లో ఓడించాలని ఆయన ప్రజలకు పిలుపు నిచ్చారు. ఈ సమావేశంలో నాయకులు రెడ్డి సాంబశివ, పొదిళ్ల చిట్టిబాబు, తీగల ఆగిరెడ్డి, గొంది రాజేశ్, ముత్యాల రాజు పాల్గొన్నారు.

కారు అదుపు తప్పి ఇద్దరికి గాయాలు

గోవిందరావుపేట, ఏప్రిల్16 : మండలంలోని పస్రా శివారులో జాతీయ రహదారిపై కారు అదుపుతప్పి చెట్టుకు ఢీకొట్టడంతో ఇద్దరికి తీవ్ర గాయాలయ్యాయి. స్థానికుల కథనం ప్రకారం.. పరకాల మండలం దామెరంచపల్లె గ్రామానికి చెందిన బొమ్మ శ్రీనివాస్, రాజ్‌కుమార్ సీడ్స్ వ్యాపారం దృష్ట్యా కర్కగూడెం వెళ్లి తిరిగి ములుగు వైపు వస్తున్నారు. ఈ క్రమంలో కారు నడుపుతున్న శ్రీనివాస్ ఒక్కసారిగా నిద్రమత్తులోకి వెళ్లడంతో అదుపు తప్పి కారు చెట్టును ఢీకొంది. ప్రమాదంలో శ్రీనివాస్ తలకు తీవ్ర గాయాలు కావడంతో పాటు కాలు విరిగింది. రాజ్‌కుమార్‌కు చేయి విరుగగా స్థానికులు 108 వాహనం ద్వారా ములుగు ప్రభుత్వ దవాఖానకు తరలించి ప్రథమ చికిత్స అనంతరం వరంగల్ ఎంజీఎం వైద్యశాలకు తరలించారు. పస్రా పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నార